


సీఎంను కలిసిన మంత్రులు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మంత్రి సీతక్క కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటాన్ని బహుకరించారు. ఇక రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో సెల్ఫీ దిగారు.



కొలువులెక్కడ?

- వ్యవసాయ మార్కెట్ కమిటీలలో ఖాళీలు
- 30 ఏళ్లుగా లేని రిక్రూట్‌మెంట్
- వరంగల్ రీజియన్ పరిధిలో 700 పోస్టులు ఖాళీ..
- 1,046 పోస్టులకు 346 మందే ఉద్యోగులు..
- ఏనుమాముల మార్కెట్‌లో 71 ఖాళీలు..
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులే దిక్కు..
- కొత్త ప్రభుత్వమైనా పట్టించుకునేనా..

వరంగల్‌టౌన్, జనవరి1 : ఏటా వందల కోట్ల ఆదాయాన్ని సంపాదించి ప్రభుత్వానికి ఇస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగులకు మాత్రం సమస్యలు తప్పడం లేదు. నలుగురు చేయాల్సిన పనిని ఒకరే చేస్తున్నా ఉన్నతాధికారుల నుంచి చివాట్లు తప్పడం లేదు. దీంతో పనిఒత్తిడితో అనారోగ్యాల పాలవుతున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 30 ఏళ్లుగా ప్రభుత్వాలు మారుతున్నా, మార్కెటింగ్‌శాఖలో మాత్రం ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ కావడం లేదు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మార్కెటింగ్‌శాఖలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని రైతులు కోరుతున్నారు. టీడీపీ, కాంగ్రెస్, ప్రభుత్వ పాలన సమయంలో మన నీళ్లను, నిధులను దోచుకెళుతున్నారని, నియామకాలలో తెలంగాణ వారికి వాటా దక్కడం లేదని ఆంధ్రావాళ్లపై నెపం నెట్టిన సంగతి మనకు తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదిన్నర ఏళ్లైన బీఆర్ఎస్ ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ, మార్కెట్ కమిటీలలో నియామకాలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు.

నలుగురు చేసే పని ఒక్కరి పైనే....

నలుగురు చేసే పని ఒక్కరే చేయాల్సి రావడంతో ఉద్యోగులు పని ఒత్తడికి గురవుతున్నారు. ఇక్కడ 1,046 మంది ఉద్యోగులు చేయాల్సిన పనిని కేవలం 346 మంది మాత్రమే చేస్తున్నారు. రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ పరిధిలోని వరంగల్ రీజియన్ పరిధిలో ఉన్న 107 వ్యవసాయ మార్కెట్ కమిటీలలో 1,046 మంది ఉద్యోగులు పని చేయాల్సి ఉంది. కానీ ఆ శాఖ ఉన్నతాధికారులు కేవలం 355 మంది ఉద్యోగులతోనే పని చేయిస్తున్నారు. అధిక పనిభారంతో ఉద్యోగులు రోగాలబారిన పడుతున్నారు. పైపెచ్చు ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేయకపోతే ఉన్నతాధికారుల చేతిలో చివాట్లు పడాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపైనే ఆధారం

మారిన కాలానుగుణంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలలో కూడా సాంకేతిక పరిజ్ఞానం (కంప్యూటర్-ఆన్‌లైన్)తో కూడిన సేవలు చాలా వరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపైనే ఆధారపడి నడిపిస్తున్నారు. కమిటీలలో పని చేసిన ఉద్యోగులు చాలా వరకు సీనియారిటీపై పదోన్నతులు పొందినవారే. కానీ వారికి సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించుకున్నారు. కొత్త రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో డిగ్రీలు, పీజీలు, ఎంబీఏలు చేసిన యువకులు అవుట్ సోర్సింగ్ పద్ధతిపైన నామమాత్రపు వేతనాలతో పని చేస్తున్నారు.

ఏటా వందల కోట్ల ఆదాయం...

మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ పరిధిలోని 107 వ్యవసాయ మార్కెట్ కమిటీలలో జరిగిన క్రయవిక్రయాలపై మార్కెట్ ఫీజు రూపేణ ఏటా వందల కోట్ల ఆదాయాన్ని వసూలు చేసి ప్రభుత్వానికి ఇస్తున్నారు. రీజియన్ పరిదిలోని 346 మంది ఉద్యోగులకు జీత భత్యాల రూపేణా ఇచ్చేది రూ.30-35 కోట్లకు మించవు. 2020-21లో రీజియన్ పరిధిలో మార్కెట్ ఫీజు రూపేణా వసూలు చేయాల్సిన టార్గెట్ రూ.236 కోట్లు కాగా రూ.313 కోట్లు వసూలు చేశారు. అలాగే, 2021-22లో టార్గెట్ రూ.307 కోట్లు కాగా రూ.291 కోట్లు వసూలు చేశారు. 2022-23 సంవత్సరానికి వరంగల్ రీజియన్ పరిధిలో మార్కెట్ ఫీజు రూపేణ రూ.431 కోట్లను వసూలు చేయాలని టార్గెట్ పెట్టారు. టార్గెట్‌ను పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు మార్కెట్ కమిటీ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. చాలా మార్కెట్ కమిటీలు టార్గెట్‌లను మించి వసూళ్లు చేస్తున్నారంటే ఉన్నతాధికారుల ఒత్తిళ్లు ఏ మేరకు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

వరంగల్ రీజియన్ పరిధిలో ..

మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ పరిధిలో గతంలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాలుండేవి. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యాక 19 జిల్లాలు అయ్యాయి. వరంగల్, హనుకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపెల్లి, జగిత్యాల, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల్ జిల్లాలో మొత్తం కలిపి 107 మార్కెట్ కమిటీలు ఉన్నాయి.

30ఏళ్లుగా నియామకాల్లేవు..

రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలలో 1994 సంవత్సరం నుంచి అంటే 30 ఏళ్లుగా కొత్త రిక్రూట్‌మెంట్ చేపట్టలేదు. అప్పటి అలాట్‌మెంట్ ప్రకారమే మార్కెట్ కమిటీలలో 700 ఖాళీ పోస్టులున్నాయి. ఇప్పుడున్న సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటర్ అవగాహణ, ఆన్‌లైన్ ఇలా అవసరమున్న పోస్టులన్నీ చాలా వరకు(అవుట్‌సోర్సింగ్-డాటా ఎంట్రీ ఆపరేటర్లు) పొరుగు సేవల నుంచి తీసుకుంటున్నారు. మరోపక్క ఉద్యోగులు విధి నిర్వాహణలో ఉండి మృతి చెందితే వారి కుటుంబసభ్యులకు (కారుణ్య నియామకాలు) అవకాశం కల్పించారు. తప్పితే కొత్తగా రిక్రూట్ చేసుకున్న దాఖలాల్లేవు.

ఏనుమాముల మార్కెట్లో 38 మందే..

వరంగల్ మార్కెట్ కమిటీలో మొత్తం 109 మంది ఉద్యోగులు పని చేయాల్సి ఉండగా కేవలం 38 మంది ఉద్యోగులే పని చేస్తున్నారు. 71 ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. అయినప్పటికిని ఉన్నతాధికారుల ఒత్తిడితో మార్కెట్ ఫీజు వసూళ్లలో మాత్రం వెనక్కి తగ్గడం లేదు..



వేయిస్తంభాల గుడిలో దర్శనానికి బారులుదీరిన భక్తులు

నయా సాల్.. నయా జోష్..

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

హనుమకొండ కల్చరల్, జనవరి 1 : నూతన ఆంగ్ల సంవత్సరం తొలి రోజు సోమవారం ప్రజలంతా నూతన ఉత్సాహంతో ఇష్టదైవాలను కొలుస్తూ ఆలయాలకు వెళ్లారు. ఉదయం నుంచే నగరంలోని ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయం, భద్రకాళి ఆలయంతోపాటు ఇతర అన్ని ఆలయాలకు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ధనుర్మాస పర్వంలో సోమవారం ప్రత్యేకమైన రోజు కావడంతో వైష్ణవ ఆలయాలకు కూడా తెల్లవారుజాము నుంచే ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.



ఎస్పీ దంపతులకు శేషవస్త్రాలు బహుకరిస్తున్న గంగు ఉపేంద్రశర్మ

రుద్రేశ్వరాలయంలో శివప్రీతికరమైన సోమవారం కూడా కలిసి రావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. క్యూలైన్‌లో భక్తులు బారులుదీరి రుద్రేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ ఒక్కరోజే సుమారు 50 వేల మంది భక్తులు తరలివచ్చినట్లు అంచనా. ఉత్తిష్ట గణపతికి అభిషేకం, రుద్రేశ్వరుడికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను ఆలయ అర్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 221 మంది దంపతులచే సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సతీసమేతంగా ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయన రుద్రేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక అభిషేకం నిర్వహింపజేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ కమిషనర్ దంపతులకు స్వామివారి శేషవస్త్రాలను బహుకరించారు. చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని రెడ్డిల కుటుంబ సభ్యులు, పలువురు జిల్లా న్యాయవాదులు పాల్గొన్నారు. ప్రేమ్‌కుమార్, రజిత, రామకృష్ణ, రుద్రేశ్వర సేవాసమితికి చెందిన గరిక అశోక్, భరత్‌కుమార్, నాగరాజు భక్తులకు సేవలందించారు.

భద్రకాళి ఆలయం కూడా భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు, ఈవో శేషుభారతి పర్యవేక్షించారు. అదే విధంగా నగరంలోని ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వరాలయం, అదాలత్ సమీపంలోని వేంకటేశ్వర ఆలయం, బ్రాహ్మణవాడలోని పెద్ద కోవెల, ఏకశిలా పార్కు సమీపంలోని రామాలయం, రెవెన్యూ రామాలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి.

ఆబ్కారీ శాఖకు కాసుల పంట

- ఒక్క రోజులో రూ. 8.15 కోట్లు ఆదాయం..
- 7,485 కేసుల మద్యం బాటిళ్లు, 10,777 కేసుల బీర్లు ఖాళీ

వరంగల్ సిటీ, జనవరి 1: ఆబ్కారీ శాఖకు కొత్త సంవత్సరపు వేడుకల జోష్ కోట్ల రూపాయలను తెచ్చిపెట్టింది. జిల్లాలోని మద్యం ప్రియులు డిసెంబరు 31 వేడుకల్లో 8 కోట్ల 15 లక్షల 2 వేల 848 రూపాయల విలువైన మద్యాన్ని తాగేశారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 75 మద్యం దుకాణాల ద్వారా రూ. 8.15 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 7,485 కేసుల మద్యం బాటిళ్ల, 10,777 కేసుల బీర్ల బాటిళ్లను తాగేశారు.

డివిజన్ల వారీగా మద్యం విక్రయాలు ఇలా...

వరంగల్ జిల్లా పరిధిలోని మూడు డివిజన్ల పరిధిలో కొత్త సంవత్సర వేడులకు మద్యం విక్రయాల జోష్ కొనసాగింది. యువత నుంచి మొదలుకొని వృద్ధుల వరకు మద్యం మత్తులో నయా సాల్ జోష్‌ను మజా చేశారు. నర్సంపేట డివిజన్‌లో వివిధ మద్యం దుకాణాల ద్వారా 4,389 కేసుల మద్యం బాటిళ్లతోపాటు 6,145 కేసుల బీరు బాటిళ్ల విక్రయించారు. ఒక్క రోజులోనే 4 కోట్ల 51లక్షల రూపాయల మద్యం విక్రయాలు జరిగాయి. వరంగల్ డివిజన్‌లోని వరంగల్ పరిధిలో 1,625 కేసుల మద్యం బాటిళ్ల, 1,803 కేసుల బీరు బాటిళ్ల మొత్తంగా 2కోట్ల లక్షా 67 వేల 226 రూపాయల విక్రయాలు జరిగాయి. ఖిలావరంగల్ పరిధిలో 879 కేసుల మద్యం బాటిళ్ల, 1,596 కేసుల బీరు బాటిళ్ల వెరసి మొత్తం 91లక్షల 93 వేల 619 రూపాయల విక్రయాలు జరిగాయి. వర్ధన్నపేట పరిధిలో 592 కేసుల మద్యం బాటిళ్ల, 1,233 కేసుల బీరు బాటిళ్ల విక్రయించగా మొత్తం 70లక్షల 42 వేల రూపాయల మద్యం వ్యాపారం జరిగింది. జిల్లాలో మొత్తంగా 7,485 కేసుల మద్యం బాటిళ్ల, 10,777 బీరు బాటిళ్ల విక్రయాలు జరగ్గా, 8 కోట్ల 15 లక్షల 2 వేల 848 రూపాయల మద్యం విక్రయాలు జరిగినట్లు ఆబ్కారీ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నారు.

ప్రాణం తీసిన అనుమానం

- కాబోయే భర్త తీరుతో యువతి మనస్తాపం
- ఉరి వేసుకొని ఆత్మహత్య
- నిశ్చితార్థం జరిగిన పది రోజులకే..
- ఇప్పగూడెంలో విషాదం



వసంత (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 1: నిశ్చితార్థం జరిగిన పదిరోజులకే ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. యువకుడి వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన లింగనబోయిన సోమయ్యసుజాత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె అయిన లింగనబోయిన వసంత (19) ఘన్‌పూర్ మోడల్‌స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమెకు గత నెలలో రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామానికి చెందిన నర్సింగుల హరీష్ అనే యువకుడితో వివాహం నిశ్చయించారు. డిసెంబరు 22వ తేదీన పెద్ద మనుషుల సమక్షంలో నిశ్చితార్థం చేశారు. ఈ క్రమంలో డిసెంబరు 31న అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో హరీష్ తన స్నేహితుడితో కలిసి వసంత ఇంటికి వచ్చాడు. వసంత తండ్రిని నిద్రలేపి మీ కూతురును పిలువమని చెప్పడంతో వసంత లేచి బయటకు వచ్చింది. ఆమెతో కొంత సమయం మాట్లాడిన హరీష్ 'మీ కూతురు రోజూ ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతోంది, నేను ఆమెను వివాహం చేసుకోను, మీరు కట్నం కింద ఇచ్చిన రూ.20వేలకు అదనంగా మరో రూ.20వేలు కలిపి ఇస్తాను' అని తండ్రి సోమయ్యకు చెప్పాడు. దీంతో ఆయన 'రాత్రి వేళ ఇంటికి వచ్చి ఇలా మాట్లాడితే ఎలా.. రేపు ఉదయం పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుందాం' అని సర్ది చెప్పినప్పటికీ వినకుండా వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన వసంత సోమవారం ఉదయం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన చెల్లెలు కావ్య ఫ్యాన్‌కు వే లాడుతున్న అక్కను చూసి బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. తండ్రి సోమయ్య ఫిర్యాదు మేరకు సీఐ సట్ల రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏటూరునాగారంలో ఉద్రిక్తత

- బైరి నరేష్‌ను అడ్డుకున్న అయ్యప్ప మాలధారులు
- నాస్తికవాదాన్ని ప్రోత్సహించొద్దని ఆగ్రహం
- తీవ్ర వాగ్వాదం.. స్వల్ప తోపులాట..
- నరేష్ కారు ముందుకు వెళ్లే క్రమంలో భక్తుడికి గాయాలు
- జీడివాగు వద్ద చెట్టుకు ఢీ.. నరేష్ సహా అనుచరుల పరార్



బైరి నరేష్‌తో వాగ్వాదం చేస్తున్న అయ్యప్ప భక్తులు



గాయపడిన భక్తుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఏటూరునాగారం రూరల్/ఏటూరునాగారం, జనవరి 1 : నాస్తికవాదంపై అయ్యప్ప భక్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేవుళ్లపై అనుచితంగా వ్యాఖ్యలు చేస్తే సహించబోమని నిరసనకు దిగారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో సోమవారం జరిగిన ఓ సమావేశానికి హాజరైన నాస్తికవాది బైరి నరేష్‌ను అయ్యప్ప భక్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొని ఉద్రిక్తతకు దారి తీసింది.

ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో భారతీయ నాస్తిక సంఘం ఆధ్వర్యంలో భీమాకోరేగావ్ స్ఫూర్తి దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బైరి నరేష్ హాజరయ్యారు. విషయం తెలుసుకున్న అయ్యప్ప భక్తులు అక్కడికి చేరుకున్నారు. నాస్తిక వాదాన్ని ప్రోత్సహించే ఇలాంటి సమావేశాలు నిర్వహించొద్దని అడ్డుకున్నారు. గతంలో మీరు అయ్యప్ప భక్తుల మనోభావాలు దెబ్బతినేలా నరేష్ మాట్లాడారని, మళ్లీ అలాంటి చర్యలకు పాల్పడేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నారని విమర్శించారు.

దీనిపై నరేష్ మాట్లాడుతూ ఈ సమావేశంలో అలాంటి వ్యాఖ్యలేవీ ఉండబోవని స్పష్టం చేశారు. అయినా అయ్యప్ప భక్తులు శాంతించలేదు. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని నరేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీలో గొడవలు సృష్టించేందుకే ఇక్కడకు వచ్చావని కోపోద్రిక్తులయ్యారు. దీంతో సమావేశాన్ని నిర్వహించి తీరుతామని నరేష్ తేల్చి చెప్పడంతో వాగ్వాదం మరింత తీవ్ర రూపం దాల్చింది. సమాచారం అందుకొని అక్కడికి చేరుకున్న పోలీసులు సమావేశాన్ని రద్దు చేసుకోవాలని నరేష్‌కు సూచించారు. దీంతో ఆయన అయిష్టంగానే కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు.

అయ్యప్ప భక్తుడికి గాయాలు

సమావేశాన్ని రద్దు చేసుకొని బయటకు వచ్చిన నరేష్ కారు ఎక్కి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. అయినా అయ్యప్ప భక్తులు కారుకు అడ్డంగా వచ్చి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కారును డ్రైవర్ ముందుకు కదలించగా పోగు నరసింహారావు అనే భక్తుడి కాలికి గాయమైంది. అయినా నరేష్ ఆగకుండా అక్కడి నుంచి మంగపేట వైపు వెళ్లిపోయారు.

ప్రమాదానికి గురైన కారు

ఏటూరునాగారం నుంచి తన అనుచరులతో బయల్దేరిన బైరి నరేష్ కారు జీడీవాగు సమీపంలోని కొమురంభీంనగర్ వద్ద చెట్టును ఢీకొని ప్రమాదానికి గురైంది. వాహనంలో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో పెను ముప్పు తప్పింది. బైరి నరేష్‌తోపాటు డ్రైవరు, మరో ఇద్దరు కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. కారు ప్రమాదానికి గురైనట్టు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఏటూరునాగారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కారును స్వాధీనం చేసుకొని నరేష్‌తో పాటు ఆయన అనుచరులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఇదే క్రమంలో నరేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప భక్తులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. గాయపడిన నరసింహారావును ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు చేసిన పోలీసులు

అయ్యప్ప భక్తుల ఫిర్యాదు మేరకు బైరి నరేష్ మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. మంగపేట వైపు అతడు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైందని, ఇది జరిగిన వెంటనే నరేష్‌తో పాటు వాహనంలో ఉన్న మరో ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారని చెప్పారు. కారును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని అన్నారు.

నేటి నుంచి యథావిధిగా ప్రజా పాలన

వరంగల్ కలెక్టరేట్, జనవరి 1: రెండు రోజులుగా సెలవు రోజు కావడంతో ప్రజా పాలన కొనసాగలేదు. మంగళవారం నుంచి యథావిధిగా ప్రజా పాలన కార్యక్రమం కొనసాగనుంది. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజా పాలన కార్యక్రమంలో నిర్దేశించిన గ్రామాల్లో, మండలాల్లో నర్సంపేట, వర్ధన్నపేట ప్రాంతాలతో పాటు వరంగల్ నగరంలో వివిధ డివిజన్లలో నిర్వహణతో పాటు వరంగల్ మునిసిపల్ కార్యాలయం వెనుక ఇండోర్ స్టేడియంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ పరిధిలోని 66 డివిజన్లకు చెందిన దరఖాస్తులను అధికారులు తీసుకోనున్నారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



ప్రశాంత్ (ఫైల్)

వాజేడు, జనవరి 1: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటు చేసుకుంది. పేరూరు ఎస్సై రమేష్ కథనం ప్రకారం.. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన తొర్రెం సరోజిని, సత్యం దంపతులకు రెండో సంతానం ప్రశాంత్(28). ఇతడికి వివాహం చేసేందుకు తల్లిదండ్రులు ఏడాది కాలంగా సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నారు. తనకు పెళ్లి కాదేమోనని మనస్తాపంతో ప్రశాంత్ ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ప్రార్థనల నిమిత్తం చర్చి వద్దకు వెళ్లి తిరిగి వచ్చే సరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పేరూరు ఎస్సై రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. తండ్రి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.









మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కేసుల నమోదు

దామెర, జనవరి 1: దామెర మండల పరిధిలో డిసెంబరు 31న అర్ధరాత్రి వరకూ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై దామెర పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి వరకూ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 22మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దామెర పోలీస్ స్టేషన్ ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారని ఎస్సై తెలిపారు.











ధర్మసాగర్ ఎస్సీకాలనీ పల్లెబండ వద్ద నిల్వచేసి తరలిస్తున్న మట్టి

అక్రమంగా మట్టి దందా

- ప్రభుత్వ భూములే లక్ష్యంగా కొనసాగిస్తున్న వ్యాపారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలంటున్న ఆయా గ్రామాల ప్రజలు

ధర్మసాగర్, జనవరి 1 : పచ్చని పంటలు పండే భూముల్లో నుంచి అక్రమంగా పట్టిని తరలించడంతో వ్యవసాయ భూములు పనికి రాకుండా పోతున్నాయి. ధర్మసాగర్ మండలం ముప్పారం, నర్సింగరావుపల్లి, నారాయణగిరి, ఎలుకుర్తి గ్రామాలలోని ప్రభుత్వ భూముల్లో నుంచి వ్యాపారులు రాత్రి పది గంటల నుంచి తెల్లవారి ఐదు గంటల వరకు మట్టిని నిరంతరం తరలిస్తున్నారు. పోలీసుస్టేషన్‌కు, తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ధర్మసాగర్ పెట్రోల్ బంక్ వద్ద నిత్యం ఎక్స్‌వేటర్స్, టిప్పర్లు ప్రతీ రోజు నిలిపి వేస్తూ రాత్రి వేళలో మట్టి రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల ఉపాధి కోసం పంపిణీ చేసిన భూముల్లో పది నుంచి పదిహేను ఫీట్ల లోతు వరకు మట్టిని తీసి తరలించడంతో భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయి. ఇటీవల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ వారి దందా మాత్రం నిలిపి వేసిన నాధుడే లేడు. ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి, ముప్పారం, నారాయణగిరి, రాపాకపల్లి, ధర్మసాగర్, దేవునూర్, శాయిపేట్, మల్లక్‌పల్లి తదితర గ్రామాలలో మట్టి వ్యాపారం చేసే వ్యాపారులు పోలీసులను, రెవెన్యూ అధికారులను, మైనింగ్, విజిలెన్స్ అధికారులను ప్రతి నెల వ్యాపారులు ప్రసన్నం చేసుకోవడం వల్లనే ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి రవాణాను నిలిపి వేయాలని పలుమార్లు అయా గ్రామాల ప్రజలు పోలీసులకు డయల్ 100కు సమాచారం అందించినా చర్యలు తీసుకున్న వారే లేరని పలువురు వాపోతున్నారు. రాత్రి వేళలో ధర్మసాగర్ పీఎస్‌కు అతి సమీపాన బ్రిక్స్ తయారీ కేంద్రం, ఎస్సీ కాలనీ పల్లెబండ, ఎలుకుర్తికి వెళ్లే దారి వద్ద, ఎలుకుర్తి కోళ్లఫామ్‌ల వద్ద మూడు చోట్ల, కరుణాపురం రింగ్ రోడ్డు బ్రిడ్జి ఎడమ వైపు రెండు చోట్ల రాత్రి వేళల్లో మట్టిని నంబర్లు లేని టిప్పర్ల సాయంతో తరలించి నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి నగరానికి, వెంచర్లకు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ధర్మసాగర్ మండలంలో మట్టి రవాణాను నిలిపి వేసి వ్యవసాయ భూములను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వం పంపిణీ చేసిన ఎలుకుర్తి భూముల్లో నుంచి మట్టి తీసిన దృశ్యం

సైనికులు చట్టసభల్లో ఉండొద్దా?

- పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ హైకమాండ్లకు రిటైర్డ్ కల్నల్ లేఖ



రిటైర్డ్ కల్నల్ డాక్టర్ భిక్షపతి

జనగామ టౌన్, జనవరి 1: 'దేశ రక్షణలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేస్తున్న సైనికులు రాజకీయాలకు పనికిరారా..? విపత్కర పరిస్థితుల్లోనూ నిబ్బరం కోల్పోకుండా దేశ రక్షణకు పనిచేసే సైనికులకు చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించగలరు.. పదవీ విరమణ పొందిన సైనికుల జ్ఞానం, అనుభవం ఇప్పుడున్న రాజకీయాలకు ఎంతో అవసరం.. వారికి చట్టసభల్లో ప్రాధాన్యం ఇచ్చే విషయంలో అన్ని పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి..' అంటూ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి భావోద్వేగ లేఖ రాశారు. పదవీ విరమణ పొందిన సైనికుల తరుపున సోమవారం ఆయన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానాలకు ఓ లేఖ రాశారు. పొరుగు దేశాల నుంచి ఎలాంటి ముప్పు లేకుండా సైనికులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. దేశ రక్షణ కోసం సియాచిన్, ద్రాస్, కార్గిల్ వంటి యుద్ధాల్లో పోరాడిన సైనికులు కేవలం ఉద్యోగాలకు మాత్రమే పరిమితమవుతున్నారని, వారికి చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తే అవినీతి రహిత పాలన అందిస్తారని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ సైనికుల సమాఖ్య తరపున విజ్ఞప్తి చేస్తే ఎవరూ పట్టించుకోలేదని, త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనైనా జవాన్లకు పోటీ చేసే అవకాశాలను పార్టీ అధిష్ఠానాలు కల్పించాలని భిక్షపతి కోరారు.



ఆధార్ అప్‌డేషన్‌కు పరుగులు

• ఆరు గ్యారంటీలకు ఆధార్‌కార్డు తప్పనిసరి • పడిగాపులు కాస్తున్న ప్రజలు • కిటకిటలాడుతున్న జిరాక్స్ సెంటర్లు





కేయూ జంక్షన్‌లోని ఆధార్ కేంద్రంలో బారులుదీరిన ప్రజలు, హనుమకొండ డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో ప్రజలు

హనుమకొండ రూరల్, జనవరి 1 : కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తప్పనిసరి కావడంతో ఆధార్ సెంటర్ల వైపు ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఆధార్ కార్డులో వయస్సు, చిరునామా తదితర మార్పులు చేయించుకుంటున్నారు. అయితే ఆధార్ తీసుకొని పది సంవత్సరాలు పూర్తయిన వారు తప్పనిసరిగా అప్‌డేషన్ చేసుకోవాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సూచించిన విషయం తెలిసిందే. అందుకు గడువు కూడా రెండుసార్లు పొడిగించింది. అయినా చాలా మంది అప్‌డేట్ చేయించుకోలేదు. ఆధార్ కార్డుపై ఆంధ్రప్రదేశ్ అని ముద్రించి ఉన్నా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నా ప్రజలు అప్‌డేషన్ కోసం ఆధార్‌సెంటర్లకు వెళుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేయాలంటే ఆధార్ అవసరం కావడంతో మీ సేవా కేంద్రాలు, ఆధార్ సెంటర్ల వైపు జనం పరుగులు పెడుతున్నారు.

సంక్షేమ పథకాలకు తప్పనిసరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ సంక్షేమ పథకాలు పొందాలంటే సంబంధిత లబ్ధిదారుల ఆధార్ నెంబరు అనుసంధానం తప్పనిసరి. ఈ క్రమంలో సంబంధిత ఆధార్‌కార్డుల్లో వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని అధికారులు పరిశీలిస్తున్నారు. పది సంవత్సరాల క్రితం జారి చేసిన ఆధార్‌కార్డుల్లో సరైన వివరాలు లేకపోవడం, ఫొటో, మొబైల్ నెంబరు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా నమోదు కాకపోవడంతో ఇతరత్రా కారణాలతో కార్డులు రిజెక్టు అవుతున్నాయి. దీంతో పింఛన్లు, రేషన్‌కార్డులు, విద్యా సంస్థల్లో ప్రవేశాలకు, బ్యాంకు ఖాతాలు, కల్యాణలక్ష్మీ, రైతుబంధు, రైతుబీమా లాంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హులైన వారు వాటికి దూరం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆధార్‌కార్డును సరిచేసుకునేందుకు ప్రజలు ఆధార్ కేంద్రాల చుట్టు తిరుగుతున్నారు.

ప్రతీ పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలి

2016 సంవత్సరానికంటే ముందు ఆధార్‌కార్డు పొందిన ప్రతీ ఒక్కరూ తగిన గుర్తింపు పత్రాలతో ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. నెలల వయసు చిన్నారుల నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారుల వరకు విధిగా ఆధార్ నమోదు చేయించాలి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే అన్ని రకాల సరుకులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 2010 నుంచి 2018 సంవత్సరాల మధ్య జారి అయిన ఆధార్‌కార్డు నమోదుదారులతోపాటు తండ్రి, భర్త విషయాలే ముద్రితమయ్యాయి. 2018 తర్వాత వాటి స్థానంలో చిరునామా మాత్రమే పేర్కొంటూ కార్డులను జారీ చేశారు. ఆధార్‌కార్డుల జారీ ప్రారంభంలో ఎలాంటి వివరాలు నమోదు చేయలేదు. ఎలాంటి వివరాలు ఆధార్‌లో లేకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యేవి. ప్రస్తుతం ఆ వివరాలకు సంబంధించిన ధృవీకరణపత్రాలు పొందుపరుస్తూ పూర్తి వివరాలతో ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.

కిటకిటలాడుతున్న జిరాక్స్ సెంటర్లు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు పెద్ద ఎత్తున ప్రజాపాలన గ్రామ, వార్డు సభలకు తరలి వస్తున్నారు. దరఖాస్తు ఫారాల కొనుగోలు, వాటికి జత చేయాల్సిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులతోపాటు ఇతర ధృవీకరణ పత్రాల కోసం వచ్చిన ప్రజలతో జిరాక్స్ సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో ప్రజాపాలన దరఖాస్తులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్నిటికి ఆధార్‌కార్డే ఆధారం

ప్రభుత్వ, ప్రయివేట్ శాఖల్లో ఏ చిన్న పని జరగాలన్నా ఆధార్‌కార్డును ప్రమాణికంగా తీసుకోవడంతో ఆధార్ కీలకంగా మారింది. ఆధార్ కార్డుల జారిని కేంద్ర ప్రభుత్వం 2010 సంవత్సరంలో తీసుకురాగా, ఆధార్‌కార్డుల అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ సేవలు వినియోగించుకోవడానికి మారుమూల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనికి తోడు నూతనంగా ఆధార్ తీసుకునేందుకు ప్రజలు నానా ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. మండలానికో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండల కేంద్రాల్లో మీ సేవా కేంద్రాలు, బ్యాంకులలో ఆధార్ సేవలు ఉన్నప్పటికీ వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో ఆధార్ సేవలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నూతనంగా ఆధార్‌కార్డులు పొందడం, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వ్యయప్రయాసల కోర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినా ఆధార్ కేంద్రాల్లో జనం ఎక్కువ సంఖ్యలో ఉండటంతో వెనుదిరగాల్సి వస్తోంది.



మల్లన్న ఆలయ గంగిరేగుచెట్టు ఆవరణలో భక్తజనసందోహం

కొమురవెల్లి మల్లన్న మూలవిరాట్టు దర్శనం నిలిపివేత

చేర్యాల, జనవరి 1 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి ఆలయంలో మల్లన్న కల్యాణం సందర్భంగా మూలవిరాట్టు దర్శనాన్ని సోమవారం సాయంత్రం నిలిపివేశారు. మూలవిరాట్టును సుందరీకరించనున్నందున గర్భాలయ ప్రవేశం, దర్శనాన్ని ఆపేశారు. భక్తుల కోసం ఉత్సవ విగ్రహాలను నెలకొల్పారు. ఈనెల 7న తెల్లవారుజామున దృష్టికుంభం నిర్వహించిన అనంతరం మూలవిరాట్టు దర్శనం ప్రారంభించనున్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పొరుగు ప్రాంతాలకు చెందిన వందలాదిమంది భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రసాద విక్రయశాల వద్ద మహిళలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పురుషులు, స్త్రీలకు ప్ర త్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేయకపోవడంతో ఒకే క్యూలైన్‌లో నిలబడి తోపులాటతో తంటాలుపడ్డారు.

మల్లన్న స్వామికి మొక్కులు చెల్లించిన 'కడియం'



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు

ఐనవోలు, డిసెంబరు 1: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు ఐనవోలు మల్లికార్జునస్వామిని సోమవారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతోపాటు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం కుటుంబసమేతంగా ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలతో పాటు పట్టువస్త్రాలు తీర్థప్రసాదాలు అందజేశారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, జడ్పీ వైస్‌చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, స్థానిక సర్పంచ్ జన్ను కుమారస్వామి, జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్ కరుణాకర్ రావు, గర్మిళ్లపల్లి సర్పంచ్ గండి మల్లికాంబరమేష్, ఎంపీటీసీ కడూదురి రాజు, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు మునిగాల సంపత్‌కుమార్, వడిచర్ల శ్రీనివాస్, బుర్ర రాజశేఖర్, ఆడేపు దయాకర్, పెండ్లి తిరుపతి, పల్లకొండ సురేష్, తండ వెంకన్న, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం గిరిజనేతరుల రిలే దీక్ష



బయ్యారంలో రిలే దీక్ష చేస్తున్న గిరిజనేతరులు

బయ్యారం, జనవరి 1: షెడ్యూల్డ్ ఏరియాలోని ఏజెన్సీ ప్రాంతంలో నివసించే గిరిజనేతరులు హక్కుల కోసం బయ్యారంలో సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఎస్సీ, బీసీ, ఓసీ, మైనారిటీ కులాలకు చెందిన వారు పలు రకాల ఇబ్బందులకు గురవుతూ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తాతముత్తాతల నాటి నుంచి ఈ ప్రాంతంలో నివసిస్తూ ఓటు హక్కు కలిగి ఉన్నప్పటికి సాగు భూములపై హక్కులు లేకపోవడంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రాక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఇకనైన ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరుల ఇబ్బందులు తొలిగిపోవాలంటే రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజా, కుల సంఘాల నేతలు, యువత మద్దతు తెలపాలని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ జనసభ జిల్లా నాయకుడు చల్లా గోవర్దన్, బీసీ జిల్లా నాయకులు చీరాల జలేందర్, మందాటి శ్రీనివాస్, నూనె యాకయ్య, నూనె బసవయ్య, వెంకటమల్లు, సుధాకర్, లక్ష్మయ్య, బుచ్చయ్య, అఖిల్, మురళి, సంతోష్, లింగయ్య, నరేష్ పాల్గొన్నారు.

లౌకికవాద రాజ్య స్థాపనకై పోరాడుదాం

▸▸ ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు

మహబూబాబాద్ రూరల్, జనవరి 1: దేశంలో కులం, మత రహిత, తాడిత, పీడిత ప్రజా సమస్యలపై పోరాడి సాధించడమే అమరులకు మనమిచ్చే నిజమైన నివాళులని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామంలో సోమవారం ఎన్డీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సంద వెంకన్న సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. దేశంలో కులం, మతం పేరుతో పాలకులు ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ తరుణంలో విప్లవ శక్తులు ఏకమై కులమత రహిత తాడిత, పీడిత ప్రజల సమస్యలపై పోరాడి హక్కులను సాధించి పెట్టడమే అమరులకు మనం అర్పించే నిజమైన నివాళులన్నారు. వెంకన్న సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, గుజ్జు దేవేందర్, మైన శ్రీనివాస్, ఎన్డీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, జడ సీతారామయ్య శివ్వారపు శ్రీధర్, శ్రీశైలం, బాబన్న, తాజ్‌పాషా, బట్టు చైతన్య, బోనగిరి మధు, పద్మ, సోమిరెడ్డి పాల్గొన్నారు.

సంస్థలను ధ్వంసం చేస్తున్న కేంద్రం : సీపీఐ



కంఠాయపాలెం గ్రామంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

తొర్రూరు రూరల్, జనవరి 1 : రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. తొర్రూరు మండలం కంఠాయపాలెంలో గ్రామ శాఖ కార్యదర్శి మార్క సాంబయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటమే తమ ధ్యేయమని అన్నారు. కేంద్రంలో బీజేపీ మతం ప్రాతిపదికన దేశాన్ని పాలించాలని చూస్తుందని, లౌకిక ప్రజాస్వామ్యం నాటకమని తెలిపారు. దేశంలో ప్రజా సమస్యలు గాలికొదిలేసి రాముడి జపం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ ఒక్కరు మతోన్మాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, మండల కార్యదర్శి యాకూబ్, సోమిరెడ్డి, దర్గయ్య, సాయిమల్లు, ఉపసర్పంచ్ రాంమూర్తి, శంకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాట్మింటన్ పోటీలకు కేయూ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 1 : కర్ణాటక రాష్ట్రంలోని బెళాగావి వీటీ యూనివర్సిటీలో జనవరి 2 నుంచి 5 వరకు నిర్వహించనున్న సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఉమెన్స్ బ్యాట్మింటన్ కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాసరావు సోమవారం ప్రకటించారు. 2023-24 సంవత్సరానికిగాను కాకతీయ యూనివర్సిటీ నుంచి జట్టు పాల్గొంటుందని వెల్లడించారు. ఎంపికైన వారిలో ఎస్.వర్షిత, వి.తనూశ్రీ, పి.లక్ష్మి (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి, వరంగల్) జి.కీర్తన, ఎం.పూజరాగప్రియ (కేయూ ఇంజనీరింగ్ కళాశాల, హనుమకొండ)లు ఎంపికైనట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు వెల్లడించారు. జట్టుకు కొత్తగూడెంలోని సింగరేణి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జట్టును కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు అభినందించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

వర్ధన్నపేట, జనవరి 1: ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని రెండవ వార్డు పరిధిలో ఉన్న రాజస్థాన్ వీధిలో ఎలాంటి రక్షణ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ అధికారులు తమకేమి పట్టనట్లుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికితోడు ట్రాన్స్ ఫార్మర్ పిచ్చిమొక్కలు ఏపుగాపెరిగి ప్రమాదరంగా మారాయి. గతంలో ఇదే కాలనీకి చెందిన ఓ బాలుడు ట్రాన్స్‌ఫార్మార్ షాక్‌కు గురై గాయాల పాలు అయ్యాడు. ప్రాణాపాయం తప్పినప్పటికీ నివాస ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాడు చేయడం స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుంచి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ యువత ఓటరు నమోదు ప్రారంభం

▸▸ మార్పులు, చేర్పులకు అవకాశం

▸▸ ఓటరు జాబితా సవరణకు ఆదేశాలు



వరంగల్ కలెక్టరేట్, జనవరి 1: యువత 18 సంవత్సరాలు నిండి జనవరి 1 నుంచి ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం యువత ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించింది. జనవరి 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా, బూత్ లేవల్ స్థాయి అధికారుల వద్ద నమోదు చేసుకోవచ్చు. నూతన ఓటరు నమోదు కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల సంఘం ముసాయిదా జాబితాను ఈనెల 6న ప్రకటించనుంది. ఓటర్లు తమ ఓటరు ఐడీ కార్డుల్లో మార్పులు, చేర్పులు తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి ఫాం-6, ఫాం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకున్న వాటిని బూత్ లెవల్ స్థాయి అధికారులు పరిశీలించి అధికారులకు అందజేస్తారు. జనవరి 6న ముసాయిదాను ప్రకటించి అభ్యంతరాలు స్వీకరిస్తారు.

ఫిబ్రవరి 8న తుది జాబితా..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 18 సంవత్సరాలు నిండిన యువతకు కేంద్ర ఎన్నికల సంఘం ఓటు హక్కు కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. అలాగే ఓటరు ఐడీ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించింది. తప్పులు ముద్రణ జరిగినచో సరిచేసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. జనవరి 6న ముసాయిదా జాబితాను ప్రకటించి జనవరి 22 వరకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటించే అవకాశం ఉంది.

ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి..

నగరంతో పాటు జిల్లాలోని గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఒక ప్రత్యేక కార్యాచరణగా రూపొందించాల్సిన అవసరం ఉంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరుగనున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించి 18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించడానికి ఇంటింటా సర్వే ద్వారా కళాశాలల్లో వివరాలను సేకరించి ఓటరు నమోదు అవకాశం చేపట్టాలి. గతంలో ఓటరుగా ఉన్న చాలా మందికి ఓటరు ఐడీ కార్డులు పోస్టు ద్వారా పంపినట్లు అధికారులు తెలిపినా చాలా మందికి పోస్టల్ ద్వారా రాలేదు. చాలా సంవత్సరాల క్రితం నుంచి ఓటరు ఐడీ కార్డు ఉన్నవారికి కూడా ప్రస్తుతం ఉన్న ఫొటోతో ఐడీ కార్డు జారీ చేసేలా మీ సేవ కార్యాలయాల్లో అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.



ఓటరు నమోదు కోసం ఇంటింటికి..

జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు నూతనంగా ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవడానికి ఓటు హక్కు కోసం యువత దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల సంఘం యువతకు ఓటు హక్కు కల్పించడానికి డిసెంబరు 20 నుంచే జిల్లాలోని గ్రామాల్లో, నగరంలోని డివిజన్లలో బూత్ లెవల్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తగా యువత ఓటు హక్కు కోసం ఫాం -6 ద్వారా నమోదు చేసుకోవాలి.

వావ్.. కొబ్బరిపువ్వు



పోషకాలమెండుతో పెరిగిన అమ్మకాలు

▸▸ నగరంలో ప్రధాన కూడళ్లలో విక్రయాలు

▸▸ కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగమతి

కరీమాబాద్, జనవరి 1: ప్రకృతి అందించే ఫలాలు మానవాళికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఒక్కో పండు ఒక్కో ప్రత్యేకతను చాటుతూ ఆరోగ్యదాయనిగా పేరుపొందాయి. అలాంటిదే కొబ్బరిపువ్వు. కొబ్బరికాయలో లోపల తెల్లని ముద్దగా ఉండేదే ఈ కొబ్బరిపువ్వు. కొబ్బరి పువ్వు దర్శనమిస్తే మంచి జరుగుతుందని ఎంతో మంది నమ్ముతారు. కాని ఇప్పుడు అదే కొబ్బరిపువ్వును తింటే ఆరోగ్యానికి మహాభాగ్యం అంటున్నారు. వాస్తవానికి కొబ్బరికాయలో నీరు ఇంకిపోయి కొబ్బరి ముదిరినప్పుడు పువ్వు ఏర్పడుతుంది. కొబ్బరినీళ్లు, కొబ్బరిలో లభించే పోషకాల కంటే ఈ పువ్వులోనే అధిక పోషకాలు లభిస్తాయని నిపుణులు అంటున్నారు.

నగరంలో అమ్మకాలు జోరు..

కొబ్బరి పువ్వు విక్రయాలు నగరంలో జోరందుకుంది. ప్రధాన కూడళ్లలో కొబ్బరిపువ్వు కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుండడంతో నగరవాసులు వాటిని ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. భద్రకాళి దేవాలయ కమాన్, కేఎంసీ ముందు, ములుగురోడ్, ఓ సిటీ, ఖమ్మం రోడ్, లేబర్‌కాలనీ, కాశిబుగ్గ జంక్షన్, పలుప్రాంతాల్లో ఈ కొబ్బరి పువ్వు అమ్మకాలు సాగుతున్నాయి. వీటి ధర ఒక్కో కొబ్బరిపువ్వు సైజును బట్టి రూ. 60 నుంచి రూ.80 వరకు లభిస్తున్నాయి.



కేసీఎం సమీపంలో కొబ్బరిపువ్వు కొనుగోలు చేస్తున్న యువకులు

కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి...

నగరంలో లభిస్తున్న ఈ కొబ్బరిపువ్వు కేరళ రాష్ట్రంలోని మున్నార్, అలిప్పి, కొట్టాయం, తిరువనంతపురం, తమిళనాడులోని కోయంబత్తూర్, ధర్మపురి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి.

ప్రయోజనాలు ఇలా..

- రక్తంలో చెక్కర స్థాయిలను అదుపుచేయడంలో ఇన్సులెన్ స్రావాన్ని ప్రేరేపించడంలో సహాయపడుతుంది.
- క్యాలరీలు తక్కువగా ఫైబర్ పీచు పదార్థాలు అధికంగా ఉండటంతో బరువు తగ్గేందుకు సహకరిస్తుంది.
- శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- అలసట, నీరసం వంటి సమస్యల్ని దూరం చేస్తుంది.
- కిడ్నీ ఇన్‌ఫెక్షన్స్, కిడ్నీ డ్యామేజ్ వంటి జబ్బులను నివారిస్తుంది.
- ఆంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంతో క్యాన్సర్ కారకాలను దరిచేరనీయదు.
- శరీరంలో హార్మోన్‌లెవల్స్‌ని సరిస్థాయిలో ఉంచుతుంది
- చెడు కొవ్వును తగ్గిస్తుంది.
- బీపీ, షుగర్, థైరాయిడ్, వ్యాధులను క్రమబద్ధీకరిస్తుంది
- జుట్టుకు కావాల్సిన పోషకాలను అందిస్తుంది.
- విటమిన్ ఈ, సీ పుష్కలంగా లభ్యం అవుతాయి
- గుండెపోటును నివారిస్తుంది.

టేస్ట్ చేద్దామని కొనుగోలు చేశాం

- ఇటుకాల సాంబయ్య, వరంగల్



నగరంలో చాలా చోట్ల ఈ కొబ్బరిపువ్వు అమ్మకాలు చేస్తున్నారు. ఒకసారి టేస్ట్ చేద్దామని కొనుగోలు చేసి తిన్నాం. చాలా రుచిగా ఉంది. ఆరోగ్యానికి కూడా చాలా మంచదని తెలిసింది. పిల్లలు కూడా ఇష్టంగా తింటున్నారు.

అమ్మకాలు పెరిగాయి....

వెల్ది లావణ్య సతీష్, కొబ్బరిపువ్వు విక్రయదారు



రెండు నెలలుగా కొబ్బరిపువ్వు అమ్మకాలు చేస్తున్నాం. ఇప్పుడు ప్రజలు ఈ కొబ్బరిపువ్వు కొనుగోలుకు ఆసక్తి కనబస్తున్నారు. అమ్మకాలు జోరందుకున్నాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు వ్యాపారం బాగుంది.



వాట్సాప్ స్టేటస్ పెట్టి ఆత్మహత్య

కాటారం, జనవరి 1: వాట్సాప్ స్టేటస్ పెట్టి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం... రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధి దేవరాంపల్లికి చెందిన కుసుమ నరేష్(28) ఎలక్ట్రీషియన్‌గా, బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగుతున్నాడు. ఆదివారం సాయంత్రం ఫోన్ రావడంతో మాట్లాడుకుంటూ వెళ్లి తిరిగి రాలేదు. ఇంతలో నరేష్ సెల్‌ఫోన్‌లో తాను చనిపోతున్నట్లు వీడియో స్టేటస్ పెట్టాడని కొందరు గ్రామస్థులు అతడి కుటుంబ సభ్యుల కు సమాచారమిచ్చారు. వారి వెతకగా అర్ధరాత్రి ధన్వాడ ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. నరేష్ అవివాహితుడు. అతడికి తల్లితోపాటు అన్న ఉన్నాడు. కొన్నేళ్ల క్రితం తండ్రి మృతి చెందాడు.



నరేష్ (ఫైల్)



కేక్ కట్ చేస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు

ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

వడ్డెపల్లి, జనవరి 1 : హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ ఆవరణలో కేక్ కట్ చేసి జర్నలిస్టులకు, కమిటీ బాధ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. అనంతరం సభ్యులకు స్వీట్ బాక్స్‌లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (హెచ్-143) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్ లెనిన్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, కార్యదర్శి తోట సుధాకర్, సీనియర్ జర్నలిస్టులు పీవీ మధన్‌మోహన్, పీవీ కొండల్‌రావు, గడ్డం కేశవమూర్తి, మెండు రవీందర్, గాడిపెల్లి మధు, కక్కెర్ల అనిల్‌కుమార్, కంకణాల సంతోష్, ప్రెస్‌క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షులు గోకారపు శ్యామ్, బొడిగె శ్రీను, దుర్గాప్రసాద్, అల్లం రాజేష్‌వర్మ, యాంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు సంపెట సుధాకర్, పెద్దపల్లి వరప్రసాద్, వలిశెట్టి సుధాకర్, కార్యవర్గ సభ్యులు వీరగోని హరీష్, అంజి, దిలీప్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 1: న్యూఇయర్ వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్త సంవత్సరం అనే సెంటిమెంట్‌తో ఉదయాన్నే దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించుకొని దేవుళ్లను దర్శించుకున్నారు. మహిళలు ఇంటి ముంగిట్లో వివిధ రకాల రంగులతో హ్యాపీ న్యూ ఇయర్ అని స్వాగత ముగ్గులు వేశారు. ముగ్గులతో రహదారుల శోభాయమానంగా కనిపించింది. నూతన సంవత్సరం సందర్భంగా అధికారులను సిబ్బంది కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులు పలువురు జిల్లా ఉన్నతాధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- శంభునిపేట : నూతన సంవత్సరం సందర్భంగా రంగశాయిపేట, శంభునిపేట ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో నిండిపోయాయి. ఉదయమే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. రంగశాయిపేటలోని భవానీ శంకరాలయం, రామాలయం, మహంకాళీ, ఆంజనేయ, రామలింగేశ్వరాలయం, శంభునిపేట హనుమాన్, విశ్వనాథకాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయాలకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంక్యలో తరలివచ్చి 2024లో సంతోషాలను ఇవ్వాలని తమ ఇష్ట దైవాలను వేడుకున్నారు.
- వరంగల్‌టౌన్ : కాశిబుగ్గ శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో సోమవారం నూతన సంవత్సరం పురస్కరించుకుని మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, అర్చనలు, అభిషేకములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజాది కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి, జిల్లా వెంకటేశ్వర్లు, మౌటం శ్రీనివాస్, పోశాలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు గుండేటి నరేంద్రకుమార్, డాక్టర్ గోనె జగదీశ్వర్, ఓరుగంటి కొంరయ్య, బైకుంతం, ముచ్చర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.
- ఖిలావరంగల్ : నగరంలోని క్రిస్టియన్‌కాలనీలో డాక్టర్ వలబోజు మోహన్‌రావు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. అలాగే టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ హాజరై కేక్ కట్ చేసి స్వీట్లను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సందెల లాజర్, జంగం ప్రభాకర్, గుడా గోవర్ధన్, దౌడు నాగరాజు, గూడ నవీన్, కొల్లూరి సుధీర్, ప్రవీణ్, కొల్లూరి చిన్న, షైదం అనిల్, నలువేరు ప్రణయ్, పాల్గొన్నారు.
- వరంగల్: నగరంలోని 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ గ్రేటర్ బల్దియా పారిశుధ్య కార్మికులతో కలిసి న్యూఇయర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు



27వ డివిజన్‌లో పారిశుధ్య కార్మికుల వేడుకలు



రంగశాయిపేట రామాలయంలో..



తెల్లవారు జామున ఇంటిముందు ముగ్గులు వేస్తున్న మహిళలు



కోటలో పర్యాటకుల సందడి

ఖిలావరంగల్, జనవరి 1: ఖిలావరంగల్ కోటలో సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా పర్యాటకుల సందడి నెలకొంది. మధ్యకోటలోని శిల్పాల ఆవరణతో పాటు, ఏకశిల గుట్ట, గుండు చెరువు, ఖుష్‌మహల్, ఏకశిల పిల్లల పార్కులో పిల్లలు, పెద్దలతో సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు కోటకు తరలివచ్చారు. కేక్ కటింగ్‌లు చేస్తూ,సెల్ఫీలు తీసుకుంటూ, గుర్రపుస్వారీ, ఆటా-పాటలతో యువత సందడి చేసింది. మధ్యకోటలోని నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వయంభూదేవాలయంలో అర్చకుడు శంభులింగం భక్తులకు అర్చన, అభిషేకాలు, నిర్వహించారు.



ఓసిటీలో నేత్రదానం

వరంగల్‌టౌన్, జనవరి 1: కాశిబుగ్గ ఓసిటీకి చెందిన తోట ఆండాళు (78) సోమవారం ఉదయం తన నివాసంలో మృతి చెందగా, ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. భర్త తోట రామయ్య, కుమారులు తోట చంద్రయ్య, తోట నర్సింహారావు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్‌లోని ఎల్‌వి. ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ నేత్రాలను సేకరించారు.

ధర్మారంలో ఉచిత వైద్యశిబిరం

గీసుగొండ, జనవరి 1: కాంగ్రెస్ జిల్లా నాయకుడు గోపాల నవీన్‌రాజ్ పుట్టినరోజు సందర్భంగా 16వ డివిజన్ ధర్మారం జెడ్పీ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్‌లు కుమారస్వామి, సంపత్‌కుమార్, సాయిప్రియ, శ్రుతి, వల్లిక, మాడిశెట్టి రాజయ్య, యాదగిరి, శ్రీనివాస్, బాలరాజు, రవి, శ్రీకాంత్, కొమ్ముల బాబు, భిక్షపతి, కేడల పద్మ పాల్గొన్నారు.

'అరూరి'ని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

పోచమ్మమైదాన్, జనవరి 1: వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్‌ను సోమవారం బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మూడో డివిజన్ కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బుద్దె శ్రీనివాస్, మంతుర్తి కుమారస్వామి, బత్తిని రాజు, బిజిలి రాజ పాల్గొన్నారు.



అరూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



కాశిబుగ్గలో ఇంటింటికి అక్షింతలు పంపిణీ చేస్తున్న రవి



22వ డివిజన్‌లో వీహెచ్‌పీ శ్రేణులు, కార్పొరేటర్ కుమారస్వామి పంపిణీ

వరంగల్‌టౌన్, జనవరి 1: కాశిబుగ్గలో సోమవారం శ్రీరంగనాథస్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి తలంబ్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సెక్రటరీ రవికుమార్, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ వడిచర్ల లక్ష్మణ్, దేవాలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు చిలుపురి సురేష్, సుల్తాన సమ్మక్క, కూరపాటి రోజ శ్రీరాములు, పుష్పలీల, సృజన, కవిత, మంచాల శ్రీనివాస్, గడ్డం భాస్కర్ పాల్గొన్నారు.

- శంభునిపేట: అయోధ్య రామ మందిర నిర్మాణంలో భాగంగా పంపిన అక్షింతలను రంగశాయిపేట రామాలయం నుంచి ఇంటింటికి పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ప్రాంతంలోని పలు కాలనీల వాసులు ప్రత్యేక రథాలను అలంకరించి అక్షింతలను భక్తి శ్రద్ధలతో, వేడుకలా తీసుకెళ్లి ఇంటింటికి పంపిణీ చేశారు.
- పోచమ్మమైదాన్: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవ సందర్భంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల పంపిణీ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. 22వ డివిజన్‌లోని పోచమ్మ దేవాలయం నుంచి సోమవారం ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రామ జన్మభూమి ట్రస్టు సభ్యుడు రాఘవులు, స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి దంపతులు హాజరై పూజలు చేసి, అక్షింతలను ఊరేగింపుగా ఇంటింటికి అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ శ్రేణులు నందాల చందర్‌బాబు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

పోచమ్మమైదాన్, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని కొత్తవాడ ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలకు సోమవారం ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ శ్రేణులు చేయూతనందించారు. ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లా వీరమల్లయ్య ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు 50దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొనుపునూరి వీరన్న, అవోపా ఆర్గనైజింగ్ సెక్రటరీ పాల మదన్మోహన్, కృష్ణమోహన్, త్రిపురాది సదాశివుడు పాల్గొన్నారు.

- గీసుగొండ: గొర్రెకుంటలో నమిండ్ల వెంకటయ్య గారి జ్ఞాపకార్థం వారి కుమారుడు నమిండ్ల క్లైమెంట్ స్థానిక వృద్ధ మహిళలకు 50దుప్పట్లను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్.నవీన్, ప్రభాకర్, యాకూబ్, బాబురావు, సంజీవ, సదానందం, నవీన్‌శ్యాం, రమేష్, రవి, పవన్, అజయ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

పోచమ్మమైదాన్, జనవరి 1: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) జిల్లా సమావేశం సోమవారం నగరంలో నిర్వహించారు. ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు గట్టు మహేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఫెడరేషన్ నూతన ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తొనుపునూరి వీరన్న, జిల్లా అధ్యక్షుడు పుల్లూరి మధు, ట్రెజరర్ ఎలగందుల రాజేంద్రప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వల్లాల శైలజ, మోదె నాగేందర్, ధనుంజయ, అనిత, జగదీశ్వరీ, మాధవి పాల్గొన్నారు.

- శంభునిపేట: భవన నిర్మాణ కార్మికులు ఆర్థికంగా ఎదగాలని ప్రతాపరుద్ర పరపతి సంఘం అధ్యక్షుడు కొంగంటి రాజేశ్వర్ అన్నారు. రంగశాయిపేట రామాలయంలో సోమవారం ప్రతాపరుద్ర తాపీ మేస్త్రీ పరపతి సంఘం బాధ్యులు సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్‌కె నాగూర్, దుబ్బాల రాజయ్య, అధ్యక్ష, కార్యదర్శులు కొంగొంటి రాజేశ్వర్, పెద్ది నగేష్, ఉపాధ్యక్షులు నాగవెల్లి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం

• పొగమంచుతో డివైడర్‌ను ఢీకొట్టిన స్కూటీ • పటాన్‌చెరువులో ఘటన



నితిన్(ఫైల్), భరత్‌చందర్ (ఫైల్)

బచ్చన్నపేట/పాలకుర్తి, జనవరి 1: నూతన సంవత్సర వేడుకల్లో సంతోషంగా పాల్గొని తిరిగి వస్తున్న విద్యార్థులను మృత్యువు వెంటాడింది. పొగమంచుతో వారు ప్రయాణిస్తున్న స్కూటీ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో బీటెక్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యుల కథనం.. బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామానికి చెందిన పాకాల నితిన్ (18), పాలకుర్తి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన రాగం భరత్‌చందర్(19)తో పాటు ఖమ్మంనకు చెందిన మరో విద్యార్థి ఏ.వంశీ సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరు ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొనేందుకు స్కూటీపై పటాన్‌చెరు వైపు బయలు దేరారు. రుద్రారం గ్రామ శివారులోని సీటీప్యాలెస్ హోటల్లో భోజనాలు చేసిన తరువాత దుర్గంచెరువు వద్దకు వెళ్లారు. వేడుకల్లో పాల్గొని తెల్లవారుజామున సంగారెడ్డికి బయలుదేరారు. 3 గంటల ప్రాంతంలో పటాన్‌చెరు దాటగానే నవోపాన్ చౌరస్తా వద్ద దట్టమైన పొగమంచు వల్ల రోడ్డు సరిగా కనబడక డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో స్కూటీ నడుపుతున్న భరత్‌చందర్, వెనుకాల కూర్చున్న నితిన్ అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక కూర్చొన్న వంశీ గాయాలపాలయ్యాడు. పటాన్‌చెరు పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వంశీని ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతదేహాలను పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం వీరి మృతదేహాలు సోమవారం రాత్రి వరకు స్వగ్రామాలకు చేరుకునే అవకాశం ఉంది.

ఆర్‌ఎంపీల సమస్యల పరిష్కారానికి పోరాటం

గీసుగొండ, జనవరి 1: ఆర్‌ఎంపీ, పీఎంపీ సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా పనిచేయాలని తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమసంఘం వ్యవస్థానక అధ్యక్షుడు హరిబాబు అన్నారు. జిల్లా కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం కొమ్మాల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బూర్గుల రాజేశ్వర్‌రావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖను, ఇటీవల గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆహ్వాన సమావేశాన్ని నిర్వహించి సమస్యలను వారి దృష్టికి తీసుకుపోవాలని తీర్మానించారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, స్వామినాథ్, భరత్‌కుమార్, సిరాజుద్దీన్, రాజిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

'వింతవ్యాధితో గొర్రెల మృతి'



నడువలేని స్థితిలో ఉన్న గొర్రెలను చూపిస్తున్న మల్లయ్య

గీసుగొండ, జనవరి 1: మండలంలోని పలు గ్రామాల్లో గొర్రెలకు వింత వ్యాధిసోకి మృతి చెందుతున్నట్లు తెలంగాణ గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు చల్లా మల్లయ్య తెలిపారు. సోమవారం ఎలుకుర్తిలో గొర్రెల మందలను పరిశీలించి వృత్తిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గొర్రెలకు మోకాళ్ల వాపు, కండ్లు కనకపోవటం వంటి లక్షణాలు కనబడుతున్నాయన్నారు. నడవలేని పరిస్థితిలో గొర్రెలు చనిపోతున్నట్లు వివరించారు. అధికారులు స్పందించి గొర్రెమందల వద్ద క్యాంపులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల ఉపాధ్యక్షుడు గాదం కుమారస్వామి, నాయకులు గాదం యాదగిరి, భిక్షపతి, గుడిపెల్లి సాంబయ్య, రాజు, కృష్ణ, మల్లయ్య, కొమురయ్య, కట్టయ్య పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందుకున్నవారితో నిర్వాహకులు

శంభునిపేట, జనవరి 1: క్రీడలు స్నేహభావాన్ని, మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా శంభునిపేటకు చెందిన ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అండర్-14 క్రికెట్ పోటీలు నిర్వహించారు. శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలకు పాఠశాల హెచ్ఎం శారదాబాయి ముఖ్యఅతిథిగా వచ్చి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ బాధ్యులు మహమ్మద్ ఖాజా, అమీర్, ఆఫ్తాబ్, రంజాన్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



గోవిందరాజుల గుట్ట వద్ద..



కొత్తవాడలో..



శివనగర్‌లో..

పోచమ్మమైదాన్, జనవరి 1: కొత్తవాడలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సోమవారం అయ్యప్ప మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. మాజీ కార్పొరేటర్, గురుస్వామి యెలుగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో 18మెట్లు ఏర్పాటు చేసి ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ యెలుగం శ్రీనివాస్, కంభంపాటి కుమారస్వామి, వెంకటమల్లు, అడెపు సదానందం, దామెర సర్వేష్, రాములు, రాజేందర్, రాజమల్లు పాల్గొన్నారు.

- ఖిలావరంగల్: భక్తులకోరిన కోర్కెలు తీర్చే మణికంఠుడు, హరిహరిపుత్ర అయ్యప్ప స్వామి పూజను మల్యాల రాజేశ్వర్‌రావుస్వామి దంపతులు ఘనంగా చేపట్టారు. సోమవారం శివనగర్‌లోని ఆయన నివాసంతో 18 మెట్లతో గణపతి, అయ్యప్పస్వామి, లక్ష్మీదేవి, వెంకటేశ్వరస్వామి, శివపార్వతుల చిత్రపటాలతో అయ్యప్పస్వామి పూజాకార్యక్రమాన్ని గురుస్వాములు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు.
- వరంగల్: నగరంలోని గోవిందరాజుల గుట్టపై స్వయంభూ శ్రీదేవిభూదేవినీళాదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ప్రాంగణంలోని మెట్ల మార్గంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప పడిపూజలో కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, టీపీసీసీ నాయకుడు మీసాల ప్రకాష్, బీఆర్ఎస్ నాయకుడు చింతాకుల సునీల్ కుమార్, ఆలయ అర్చకులు వరయోగుల కృష్ణమూర్తి స్వామి, వేణుమాధవ్ స్వామి, క్రాంతికుమార్ స్వామి.కిరణ్ స్వామి, వేణు స్వామి,హరీష్ స్వామి పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానం జరిగింది.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

గీసుగొండ, జనవరి 1: మరియపురంనకు చెందిన బిట్ల స్వర్ణ ఇటీవల అనారోగ్యంతో చెందగా, ఆ కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ. 5వేల ఆర్థికసాయం సోమవారం అందించారు. అలాగే, ఊకల్‌కు చెందిన మొగసాని రమేష్ ఇటీవల రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోగా ఆ కుటుంబానికి కూడా రూ.5వేల ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు అల్లం మర్రెడ్డి, మాదాసి రాంబాబు, కమలాకర్, రమేష్, జోజిరెడ్డి, సుభాష్, రాజు పాల్గొన్నారు.



భగత్ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా సుధాకర్



ఖానాపురం, జనవరి 1 : మండలంలోని ధర్మరావుపేట గ్రామానికి చెందిన భగత్ యూత్ క్లబ్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోరె సుధాకర్, ఉపాధ్యక్షుడిగా సిడిమిండ్ల సోమయ్య, ప్రధాన కార్యదర్శిగా కర్రె రమేష్, సహాయ కార్యదర్శిగా రాజబోయిన ప్రభాకర్, కన్వీనర్‌గా తండ రమేష్, ముఖ్య సలహాదారులుగా తక్కళ్లపల్లి కరుణాకర్, కొడిమాల సురేష్, కొలుగూరి దేవేందర్, చీర లింగయ్య, కొనుకటి రమేష్, జంగిలి వెంకన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో భగత్ ఎఫ్‌పీవో చైర్మన్ కత్తాల వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ కొడిమాల యాకస్వామి, పోతరాజు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఎమ్మెల్యే మాధవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న రవీందర్‌రావు

ఖానాపురం, జనవరి 1 : ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎంపీపీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

● నల్లబెల్లి : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మర్యాద పూర్వకంగా సోమవారం హన్మకొండలోని ఎమ్మెల్యే స్వగృహంలో గుండ్లపహాడ్ కాంగ్రెస్ నాయకులు కలిశారు. అనంతరం ఎమ్మెల్యే దొంతికి బోకేను అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంసురేష్, కడ్దూరి కట్టయ్య, రంజిత్, రవి తదితరులు పాల్గొన్నారు.

● ప్రమాదానికి గురైన కార్యకర్తకు ఎమ్మెల్యే పరామర్శ

మండలంలోని రుద్రగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎలుకపెల్లి మధు ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనంపై నుంచి కింద పడిపోవడంతో కాలు విరిగింది. దీంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సోమవారం రుద్రగూడెం గ్రామానికి చేరుకొని కార్యకర్త మధును పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు చిట్యాల తిరుపతిరెడ్డి, కుసుంబ రఘపతి, మామిండ్ల రాజిరెడ్డి, అజ్మీర తిరుపతి, రఘసాల హన్మంతు, బేతి భరత్‌కుమార్, వక్కల అయ్యప్ప, గాదె మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి వద్ద రైలు ప్రమాదం

● బొబ్బరోనిపల్లికి చెందిన వ్యక్తి మృతి



కొత్తపల్లి రాజు(ఫైల్)

దుగ్గొండి, జనవరి 1 : మండలంలోని బొబ్బరోనిపల్లికి చెందిన ఓ వ్యక్తి యాదాద్రి జిల్లా భువనగిరి వద్ద జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం బొబ్బరోనిపల్లికి చెందిన వార్డు సభ్యుడు కొత్తపల్లి రాజు (35) హైదరాబాదులో ఓ ప్రైవేటు కంపెనీలో రెండు నెలలుగా పనిచేస్తున్నాడు. కాగా, సోమవారం స్వగ్రామానికి రావడానికి రైలులో బయలు దేరాడు. రైలు భువనగిరి వద్దకు చేరుకోగానే ప్రమాదవశాత్తు రాజు రైలు నుంచి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు రాజు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రాజు వద్ద దొరికిన ఆధారాల ప్రకారం పోలీసులు దుగ్గొండి మండలం బొబ్బరోనిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్వగ్రామానికి బంధువులు తీసుకువచ్చారు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ ఆస్పత్రి



మాట్లాడుతున్న డాక్టర్ నర్సింహాస్వామి

వర్ధన్నపేట, జనవరి 1 : వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని అభివృద్ధిచేసి మరిన్ని సౌకర్యాలు ప్రజలకు అందుబాటులోకి తెస్తా నని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు హామీ ఇచ్చారని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహాస్వామి తెలిపారు. 30 పడకలుగా ఉన్న ఆస్పత్రి 150 నుంచి 200డెలివరీల వరకు చేస్తూ వైద్యాధికారులు మన్ననలు పొందడం జరిగిందని తెలిపారు. పై అధికారుల ఆదేశాలు తూ.చ తప్పకుండా పాటిస్తూ అభివృద్ధి పథంలో పయనిస్తున్నట్లు చెప్పారు. కోవిడ్ సమయంలో ఆస్పత్రిలో ప్రసవాలతోపాటు ఇతర సేవలను సైతం టార్గెట్‌కు తగ్గకుండా విధులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

జీపీ సిబ్బందికి ఇన్సూరెన్స్



జీపీ సిబ్బందికి ఇన్సూరెన్స్ కార్డులను ఇస్తున్న రేలకుంట సర్పంచ్ రత్నకర్‌రావు

నల్లబెల్లి, జనవరి 3 : నూతన సంవత్సరం సందర్భంగా జీపీ సిబ్బందికి ఆక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌ను చేపించి కార్డులను సోమవారం రేలకుంట జీపీ కార్యాలయంలో సర్పంచ్ రత్నకర్‌రావు సిబ్బందికి అందజేశారని పంచాయతీ కార్యదర్శి సరస్వతి అన్నారు. జీపీ సిబ్బంది సర్పంచ్‌కి ధన్యవాదాలు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కిషన్, రాజు, రాజన్న, విజేందర్, కోమల, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేదెప్పుడో..?

- కలగానే డబుల్ రోడ్డు నిర్మాణ పనులు
- గుంతలమయంగా మారిన రోడ్డు
- ఇబ్బందులుపడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఉప్పరపల్లిలో గుంతల మయంగా మారిన ప్రధాన రహదారి



రోడ్డుపై ఉన్న కల్వర్టుల నిర్మాణం చేస్తున్న దృశ్యం



రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది (ఫైల్)

చెన్నారావుపేట, జనవరి 1 : చెన్నారావుపేట మండల కేంద్రం మీదుగా కోనాపురం నుంచి ఉప్పరపల్లి గ్రామ ప్రధాన రోడ్డు నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగానే ఉండటం పట్ల పలువురు అసహనం వ్యక్తంచేస్తున్నారు. చెన్నారావుపేట గ్రామం నుంచి గీసుగొండ మండలం మచ్చాపూర్ రోడ్డువరకు నాన్ ప్లాన్ నిధుల కింద రూ2కోట్ల 50 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులను అప్పటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి 2023 మార్చి నెలలో ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన అధికారులు. పాలకులు మొదటగా కోనాపురం గ్రామం శివారు వరకు మాత్రమే ఓ కాంట్రాక్టర్ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి వదిలివేశాడు. మరో కాంట్రాక్టర్ మిగతా గ్రామాలైనా ఉప్పరపల్లి, జడీగడ్డతండా నుంచి మచ్చాపూర్ వర కువెళ్లే బీటీ రోడ్డు నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగానే వదిలేశారు.దీంతో గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అడుగడు గునా గుంతలమయంగా మారిందని వాహనదారులు ఆవేద న వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు సౌకర్యం సరిగా లేక పోవడంతో ఆర్టీసీ బస్సులు రాని పరిస్థితి నెలకొంది. అలాగే వాహనదారులు, ప్రయాణికులు ఈ రోడ్డుపై ప్రయాణం చే యడం ఇబ్బందికరంగానే ఉందని ఆరోపిస్తున్నారు. నెలలుగా రోడ్డుపై ఉన్న కల్వర్టుల నిర్మాణాలు జరుగుతున్నాయని, రోడ్డు నిర్మాణ పనులను మాత్రం చేపట్టడంలేదు. రోడ్డు నిర్మాణ పనుల్లో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే రోడ్డు పనులు నిలిచిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డ నిర్మాణ పనులను సంబంధిత కాంట్రాక్టర్ వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

● పనులను త్వరితగతినా పూర్తిచేయాలి

చింతకింది శివకృష్ణ, ఉప్పరపల్లి



గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి రోడ్డు నిర్మాణ పనులను సంబంధిత కాంట్రాక్టర్ త్వరితగతినా పూర్తి చేయాలి. కాంట్రక్టర్ నిర్లక్ష్యంతోనే రోడ్డు పనులు ఆలస్యమవుతున్నాయి. గుంతలమయంగా మారిన రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి సమయంలో రోడ్డుపై వెళ్లడం నరకయాతనగా మారింది. గతంలో రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్థులతో కలిసి ఆందోళన చేపట్టాం. సంవత్సరాలు గడిచినా, రోడ్డు నిర్మాణాలు మాత్రం జరుగటంలేదు.

● ఆర్టీసీ బస్సులు రాక ఇబ్బందులు పడుతున్నాం..

పరికి మధుకర్, ఉప్పరపల్లి



రోడ్డు సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు రావటం లేదు. గ్రామానికి నర్సంపేట నుంచి కేవలం ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు వస్తోంది. గతంలో ఉప్పరపల్లి మీదుగా మచ్చాపూర్ కలుపుతూ వరంగల్ వరకు బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం వరంగల్‌కు వెళ్లడం ఇబ్బందికరంగానే ఉంది. రోడ్డు నిర్మాణ పనులను అధికారులు, పాలకులు పట్టించుకోవటం లేదు. రోడ్డు నిర్మాణం చేస్తే ప్రయాణికుల కష్టాలు తీరుతాయి. త్వరితగతినా రోడ్డు నిర్మాణాలను పూర్తి చేయాలి.

ఘనంగా న్యూ ఇయర్ వేడుకలు







ఎమ్మెల్యే దొంతికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పెద్దికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెబుతున్న బీఆర్ఎస్ నాయకులు, చెన్నారావుపేటలో సర్పంచులను సన్మానిస్తున్న నాయకులు

నర్సంపేట, జనవరి 1 : నర్సంపేట నియోజకవర్గంలో న్యూ ఇయర్ వేడుకలు ఆనందోత్సాల మధ్య ఘనంగా జరిగాయి. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని యువత విందు వినోదాల్లో మునిగిపోయారు. కేకుల విక్రయాలతో నర్సంపేట పట్టణం సందడిగా మారింది. ఆదివారం రాత్రి 12 గంటలకు యువతీ, యువకులు, మహిళలు, మహిళా సంఘాల సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కేకులు కట్‌చేసి న్యూ ఇయర్ సంబరాలతో 2023 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, 2024 సంవత్సరానికి స్వాగతం పలికారు. సరిగ్గా రాత్రి 12 గంటలకు టపాసులు కాల్చి న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వాట్సాప్‌ల ద్వారా మిత్రులు, బంధువులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపు సందేశాలను పంపారు. సోమవారం విద్యార్థినీ, విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. ఇంటి ముంగిట నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మహిళలకు రంగురంగుల ముగ్గులను వేశారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని ఓడీసీఎంఎస్ చైర్మెన్ గుగులోతు రామస్వామినాయక్, మునిసిపల్ వైస్ చైర్మెన్ మునుగాల వెంకట్‌రెడ్డి. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్‌లు కలిసి బొకెను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హన్మకొండలోని తన నివాసానికి కొందరు కాంగ్రెస్ నాయకులు తక్కళ్లపల్లి రవీందర్‌రావు, గాజుల రమేశ్, గొర్రె నవీన్, నాళం విజయ్‌కుమార్ వెళ్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

● వర్ధన్నపేట రూరల్ : 2023 సంవ్సరానికి వీడ్కోలు పలుకుతూ 2024 ఆంగ్ల నామ సంవత్సరానికి సోమవారం స్వాగతం పలికారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రాత్రి 12 గంటల తర్వాత కేక్ కట్ చేసి హ్యాపీ న్యూ ఇయర్ చెప్పుకున్నారు. ఉదయం లేవగానే మహిళలు ఇంటి ముందు ముగ్గులు వేసి 2024ను స్వాగతించారు. ఈ సందర్భంగా పోలీసులు ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు, పెట్రోలింగ్, డ్రంకన్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు.

● రాయపర్తి : మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని యువతీ యువకులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సందడి చేశారు.

● నెక్కొండ : పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్పడం, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ మండల ప్రజలు సంతోషంగా వేడుకలను జరిపారు. అర్ధరాత్రి సమయంలో పెద్ద ఎత్తును టపాసులు పేల్చడంతో పాటు మిఠాయిలను పంచిన వివిధ పార్టీల నాయకులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కెక్‌లను కట్ చేశారు. చిన్న పిల్లలు గ్రీటింగ్ కార్డులను పంచుకున్నారు. మహిళలు రాత్రి నుంచి ఉదయం వరకూ వారి ఇండ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. మోటారు సైకిళ్లపై యువత వీధుల వెంట తిరుగుతూ సందడి చేశారు. రాజకీయ పార్టీల నాయకులు పార్టీలకు అతీతంగా ఒక్కరికి ఒక్కరు రంగులను చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. మండల కాంగ్రెస్ నాయకులు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి, బీఆర్ఎస్ మండల నాయకులు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి పూల బొకెలను అందించిన శుభాకాంక్షలు తెలిపారు.

● ఖానాపురం : నూతన సంవత్సర వేడుకలను మండల వ్యాప్తంగా సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులతో అలంకరించారు. ఖానాపురం, బుధరావుపేట, ధర్మరావుపేట, అశోక్‌నగర్, రంగాపురం, కొత్తూరు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖానాపురంలో సీఐ పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో పోలీస్‌లు కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామినాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావులు మండల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

● చెన్నారావుపేట : చెన్నారావుపేట మండలంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా జరిపారు. కట్టాయపెల్లిలోని చర్చిలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా గ్రామ సర్పంచ్, మహిళ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తూటి పావనిరమేశ్, గుంటూరుపల్లి సర్పంచ్ మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మలను శాలువాలతో సన్మానించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, పలువురు నాయకులు బొకె అందించి శుభాకాంక్షలు తెలిపారు. తిమ్మరాయినిపహాడ్, గురిజాల, క్రీస్తునగర్ , రాజీవ్‌నగర్, సూర్యపేట, జోజిపేట, పాపయ్యపేట గ్రామ చర్చిలో నూతన సంవత్సర వేడుకలను జరిపారు.



నెక్కొండలో న్యూ ఇయర్ కెక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు



ఖానాపురంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేసి ఎస్సై మాధవ్‌గౌడ్‌కు తినిపిస్తున్న సీఐ కిషన్

న్యూ ఇయర్ వేడుకల్లో విషాదం

- పొగమంచుతో డివైడర్‌ను ఢీకొట్టిన స్కూటీ
- హైదరాబాద్ పటాన్‌చెరువు సమీపంలో ఘటన
- జనగామ జిల్లాకు చెందిన ఇద్దరు బీటెక్ విద్యార్థుల మృతి



పాకాల నితిన్ (ఫైల్)



రాగం భరత్ చందర్ (ఫైల్)

బచ్చన్నపేట/పాలకుర్తి, జనవరి 1 : నూతన సంవత్సర వేడుకల్లో సంతోషంగా పాల్గొని తిరిగివస్తున్న విద్యార్థులను మృత్యువు వెంటాడింది. పొగమంచు వల్ల వారు ప్రయాణిస్తున్న స్కూటీ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో బీటెక్ చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామానికి చెందిన పాకాల నితిన్ (18), పాలకుర్తి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన రాగం భరత్‌చందర్ (19)తో పాటు ఖమ్మంనకు చెందిన మరో విద్యార్థి ఏ.వంశీ సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు.

వీరు ఆదివారం రాత్రి 7 గంటల ప్రాంతంలో న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొనేందుకు స్కూటీపై పటాన్‌చెరు వైపు బయలు దేరారు. రుద్రారం గ్రామ శివారులోని సీటీప్యాలెస్ హోటల్లో భోజనాలు చేసిన తరువాత దుర్గంచెరువు వద్దకు వెళ్లారు. న్యూ ఇయర్ వేడుకల్లో సంతోషంగా పాల్గొని తెల్లవారుజామున సంగారెడ్డికి బయలుదేరారు. 3 గంటల ప్రాంతంలో పటాన్‌చెరు దాటగానే నవోపాన్ చౌరస్తా వద్ద దట్టమైన పొగమంచు వల్ల రోడ్డు సరిగా కనబడక డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో స్కూటీ నడుపుతున్న భరత్‌చందర్, వెనుకాల కూర్చున్న నితిన్ అక్కడికక్కడే మృతిచెందారు. వెనుక కూర్చొన్న వంశీ గాయాలపాలయ్యాడు. పటాన్‌చెరు పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వంశీని ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి మృతదేహాలను పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

● ఇరు కుటుంబాల్లో విషాదం..

రోడ్డు ప్రమాదంతో మృతిచెందినవారిలో నితిన్ తండ్రి ఏడాది క్రితం మృతి చెందగా, తల్లి సంతోష కూలి పనులు చేస్తూ నితిన్‌ను చదివిస్తోంది. ఇక భరత్‌చందర్ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. ఇద్దరు అక్కలు ఉన్నారు. తల్లిదండ్రులు రాగం రాజన్నరజిత దంపతులది వ్యవసాయ కుటుంబం. రెక్కల కష్టాన్ని నమ్ముకొని కష్టపడి పిల్లలను చదివిస్తున్నారు. కుటుంబానికి ఆధారంగా నిలుస్తాడనుకున్న కుమారుడు అకాల మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోస్టుమార్టం అనంతరం వీరి మృతదేహాలు సోమవారం రాత్రి వరకు స్వగ్రామాలకు చేరుకునే అవకాశం ఉంది.



కోటలో పర్యాటకుల సందడి

ఖిలావరంగల్, జనవరి 1: ఖిలావరంగల్ కోటలో సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా పర్యాటకుల సందడి నెలకొంది. మధ్యకోటలోని శిల్పాల ఆవరణతో పాటు, ఏకశిల గుట్ట, గుండు చెరువు, ఖుష్‌మహల్, ఏకశిల పిల్లల పార్కులో పిల్లలు, పెద్దలతో సందడిగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు కోటకు తరలివచ్చారు. కేక్ కటింగ్‌లు చేస్తూ,సెల్ఫీలు తీసుకుంటూ, గుర్రపుస్వారీ, ఆటా-పాటలతో యువత సందడి చేసింది. మధ్యకోటలోని నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు స్వయంభూదేవాలయంలో అర్చకుడు శంభులింగం భక్తులకు అర్చన, అభిషేకాలు, నిర్వహించారు.



అయోధ్య శ్రీరామ అక్షింతలతో నగర సంకీర్తన



నర్సంపేటలో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

నర్సంపేట టౌన్, జనవరి 1 : నర్సంపేట పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయ కమిటీ, విశ్వహిందూ పరిషత్, అయోధ్య రామజన్మ భూ తీర్థ క్షేత్ర సంయోజకులు, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ మందిరంలో తీర్థ కలషములతో పూజాధికాలు చేసిన శ్రీరామ అక్షింతలతో సోమవారం పట్టణంలో నగర సంకీర్తన చేశారు. శ్రీవెంకటేశ్వర ఆలయం నుంచి శివాంజనేయస్వామి దేవాలయం, సుభాష్‌వీధి, పాఖాల్ రోడ్, అంబేద్కర్ సెంటర్ అంగడి సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, మోతె సమ్మిరెడ్డి, తాత ఐలోని, పొలబోయిన మురళీధర్, మల్యాల రవి, తాళ్లూరి వీర వసంతరాజు తదితరులు పాల్గొన్నారు. నర్సంపేట మండలం దాసరిపల్లిలో శ్రీరామ అక్షింతల వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

గురిజాల ఆటో యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

నర్సంపేట టౌన్, జనవరి 1 : నర్సంపేట మండలం గురిజాల కాకతీయ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా గొడిశాల శ్రీనివాస్‌గౌడ్ ఎన్నికయ్యారు. సోమవారం యూనియన్ సభ్యులు సమావేశమై అధ్యక్షుడిగా గొడిశాల శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా మడిపెద్ది రాజు, కార్యదర్శిగా పత్తిరి రాజు, సహాయ కార్యదర్శిగా సున్నపు శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.